
నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



వక్రతుండ మహాకాయ..
కోటి సూర్య సమప్రభ..
నిర్విఘ్నం కురుమే దేవా..
సర్వ కార్యేషు సర్వదా..!

వినాయకుడి పండుగకు ఊరూవాడా సిద్ధమైంది. శనివారం పల్లె మొదలు పట్నం వరకు వాడవాడలా విభిన్న రూపాల్లోని విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మండపాలను చూడముచ్చటగా ముస్తాబు చేశారు. చిన్నారులు, యువత ఏర్పాట్లలో పూర్తిగా నిమగ్నమయ్యారు. లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్స్‌లు బిగించారు.

'మహా గణపతిం.. మనసాస్మరామి'.. అంటూ భక్తుల నామస్మరణ మార్మోగనున్నది. విఘ్నాలు తొలగించు వినాయకా.. అంటూ మనసారా కొలవనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లల్లో సందడి నెలకొన్నది. పండ్లు, వనం, అలంకరణ వస్తువుల అమ్మకాలతో జోష్ నెలకొన్నది.

# అవిఘ్నమస్తు

## నేడు వినాయక చవితి

- గణేశ్ పండుగ ఏర్పాట్లల్లో నిర్వాహకులు
- ప్రతిష్ఠాపనకు చూడముచ్చటగా మండపాల ముస్తాబు
- విగ్రహాల తరలింపులో యువత
- 'ఏకో'దంతుడికి భక్తుల జై
- సందడిగా మారిన మార్కెట్లు

గద్వాల టౌన్/మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 6 : విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు.. ముక్కోటి దేవతలతో తొలి పూజలు అందుకునే ఆదిదేవుడు.. ఆపదలో ఆదుకునే లంబోధరుడు.. విద్యకు నాయకుడు వినాయకుడు.. గరిక పూజలకే సంబురపడే గణనాథుడు దివి నుంచి భువికి దిగి వచ్చేశాడు.. శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని వాడవాడలా కొలువుదీరేందుకు సిద్ధమయ్యాడు.. చిన్నాపెద్ద, ధనిక, బీద తేడా లేకుండా అందరితో సమాన పూజలు అందుకోనున్నాడు.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు..

**వినాయక రూపం..**

గజముఖం.. ఏక దంతం.. పెద్ద పొట్ట.. మూషిక వాహనం.. వంటి విచిత్ర ఆహార్యం బాహ్యసౌందర్యం కన్నా అంతర్ సౌందర్యం మంచిదైతే చాలన్న సత్యాన్ని గణేశ్ రూపం విశదీకరిస్తుంది.

**ప్రకృతికి పెద్దపీట..**

వినాయక చవితి మనిషికి ప్రకృతికి మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేస్తుంది. ప్రకృతిని దైవంగా భావించే సంస్కృతి ఒక హిందూ మతంలోనే ఉంది. వినాయక పూజలో ప్రకృతిని ఎంతగా ఆరాధిస్తారో బోధ పడుతున్నది. గణనాథుడిని ప్రతిష్ఠించిన తర్వాత 21రకాల ప్రకృతి సిద్ధమైన పత్రాలతో పూజిస్తారు. ఈ పత్రాలతో ఎన్నో రకాల ఆయుర్వేద మందులను తయారు చేస్తారు. 21రకాల ఆకులు, పూలతో పూజించడంలోనే మనిషి ప్రకృతిని ఎంతగా ఆరాధిస్తాడో బోధ పడుతుంది.

**పూజలో వాడే పత్రాలు..**

తులసి, రేగు, బిల్వం, రాగి, జమ్మి, నేల మునగ, జిల్లేడు, మర్వం, దానిమ్మ, విరజాజి ఆకు, గన్నేరు, ఉమ్మెత్త, గరిక, ఉత్తరేణి, మామిడి ఆకు, విష్ణుక్రాంత పత్రం, దేవదారు, వావిలి ఆకు, దేవకాంచనం, వాకుడాకు, అర్జున పత్రం ఇలా 21 రకాల పత్రాలను స్వామికి సమర్పిస్తారు. నవరాత్రుల్లో 21పత్రాలను ఇంట్లో ఉంచుకోవడం ద్వారా వాటి నుంచి వెలువడే ప్రాణవాయువు ఆరోగ్యాన్ని చేకూర్చుతుంది. అలాగే వీటిని నీటిలో వేయడం ద్వారా నీటి శుద్ధి జరిగి క్రిములు నాశనమవుతాయి. 21 పత్రాల్లో అనేక ఆయుర్వేద గుణాలు ఉన్నాయి. ఒక్కో పత్రంలో ఒక్కో గుణం ఉందని పూర్వీకులు అనేక రోగాలకు విరివిగా వాడేవారు.

**తొమ్మిది రోజులు పూజలే..**

వినాయకుడి రూపమే ప్రత్యేకం. గజముఖం, ఏక దంతం, లంబోధరుడు, మూషిక వాహనుడు, ఇది వినాయకుడి భౌతిక రూపం. తరచి చూస్తే నిజంగానే ఆ రూపం అపురూపం. ప్రతి సంవత్సరం బాధ్రపద మాసంలో చవితి నాడు వినాయకచవితి పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. ఎవరి శక్తి కొలది వారు ఆ దేవుడి కొలుస్తారు. పిల్లల చదువు కోసం, ఇష్ట కార్యసిద్ధి కోసం, జ్ఞానం కోసం, విఘ్నాలు తొలగాలని ఇలా తొమ్మిది రోజులు వినాయక మండపాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారు. దీంతో తొమ్మిది రోజులపాటు మండపాలన్నీ భక్తులతో నిండి ఉంటాయి.

**ఘనంగా ఏర్పాట్లు..**

వినాయక చవితిని శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహించుకునేందుకు భక్తులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మండపాలను సెట్టింగ్‌లు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిష్ఠించిన విగ్రహాలను 3, 5, 9, 11 రోజులు ఇలా ఎవరికి తోచిన విధంగా వారు పూజలు చేస్తారు.

**విరివిగా 'ఎక'దంతుడి అమ్మకాలు**

పీవోపీతో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతిపరమైన నష్టాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది చాలామంది మట్టి వినాయకులను ప్రతిష్ఠించడానికి మొగ్గు చూపుతున్నారు. ధర ఎక్కువైనా మట్టి ప్రతిమలనే కొనుగోలు చేసి పలువురికి ఆదర్శంగా నిలవాలన్న తాపత్రయం కనిపిస్తున్నది.

**పెరిగిన ధరలు..**

వినాయక చవితి పండుగకు పండ్లు, పూలు, ఆకులు, వెలక్కాయ తదితర పూజా సామగ్రి ధరలు చుక్కలనంటాయి. ఒక్కో ఎల్లక్కాయ రూ. 10 నుంచి రూ.30ల దాకా విక్రయిస్తుండగా డజన్ అరటిపండ్లు రూ. 80లు రేటు దాటింది. చివరికి పొలాల్లో దొరికే గరక, ఉత్తరేణి, గురుగుపూలు, చెరకు తదితర ప్రకృతిపరమైనవి కూడా మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. అన్ని కలిపి తయారు చేసిన ఒక కట్టను రూ. 50నుంచి రూ.100వరకు విక్రయించారు. ఇక పూల ధరలు కూడా ఆకాశాన్నంటాయి.

**పాలమూరులో 500పైగా మండపాలు**

మహబూబ్‌నగర్ పోలీస్ శాఖ పరిధిలో ఇప్పటి వరకు 500మండపాలకుపైగా విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు పొందినట్లు అధికారులు తెలిపారు.



మహబూబ్‌నగర్‌లోని ఓ తయారీ కేంద్రంలో ప్రతిష్ఠాపనకు సిద్ధమైన గణపయ్యలు



గద్వాల జిల్లా కేంద్రంలో గణేశుడిని తరలిస్తున్న యువకులు



- ఆవంచలో 30 అడుగుల ఏకశిలా గణపతి
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న విగ్రహం
- ఇంటర్నెట్‌లో తెలుసుకొని వస్తున్న భక్తులు
- ఆలయం నిర్మాణం కోసం ఎదురుచూపు

# వినాయకా.. నీ విఘ్నాలు తొలగేనా..?

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 6 : దేశంలోనే అతి పెద్ద ఏకశిలా వినాయక విగ్రహం తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఉంది. 9వ శతాబ్దానికి చెందిన ఈ విగ్రహానికి మందిర నిర్మాణం అప్పటి నుంచి వాయిదా పడుతూనే ఉన్నది. 30 అడుగుల విగ్రహం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరాధరణకు గురువుతున్నది. విగ్రహ చరిత్రను పరిశీలిస్తే సుమారు 879 ఏండ్ల కిందట క్రీ.శ 1140లో ఈ విగ్రహాన్ని తైలంపుడు అనే రాజు చెక్కించాడు. ప్రస్తుతం గుల్బర్గా జిల్లాగా పిలవబడుతున్న ప్రాంతం, అప్పుడు బాదామి రాజ్యంగా ఉండేది. దీనిని విక్రమాదిత్యుడు అనే రాజు పాలించేవాడు. పశ్చిమ చాళుక్యుల వంశానికి చెందిన ఆయనకు ఇద్దరు కుమారులు. చాళుక్యులు తెలంగాణ ప్రాంతాన్ని 200 ఏండ్లు పరిపాలించారు. ఈ క్రమంలో ఆయన రెండో కుమారుడు తైలంపుడు సామంత రాజుగా మన ఉమ్మడి జిల్లాలోని కందూరు రాజధానిగా చేసుకొని పాలించాడు. క్రీ.శ 1113లో రాజధానిని ఆవంచకు మార్చాడు. బాదామి రాజధాని వాతాపిలో 30 అడుగుల గణపతి విగ్రహం ఉండేది. అదే తరహాలో ఆవంచలో శిలపై విగ్రహాన్ని చెక్కించడం ప్రారంభించాడు. అయితే ఆ సమయంలో అతని తండ్రి మృతిచెందాడనే సమాచారంతో అతడు వాతాపికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఈ విగ్రహం అసంపూర్తిగా మిగిలిపోయింది. కొన్నేండ్ల కిందట ఈ విషయం తెలుసుకున్న హైదరాబాద్‌కు చెందిన కొందరు భక్తులు మందిర నిర్మాణం కోసం ముందుకొచ్చారు. ఎనిమిదేండ్ల కిందట పూజలు చేసి ఐశ్వర్య గణపతిగా నామకరణం చేశారు. మందిర నిర్మాణ నమూనాను రూపొందించారు. మూడేండ్ల కిందట పూణే కేంద్రంగా నడుస్తున్న ఒక ట్రస్ట్ కూడా ముందుకొచ్చింది. ప్రధాన మందిరంతో పాటు, గుడి చుట్టూ 28 మందిరాలు నిర్మించాలని నిర్ణయించారు. అయినా నిర్మాణానికి మాత్రం నోచుకోలేదు. ఇక్కడ ఆలయం నిర్మిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నది. ఇంటర్నెట్‌లో ఈ విగ్రహం గురించి తెలుసుకొని భక్తులు ఇక్కడికి వస్తున్నారు. శనివారం చవితి ఉండగా.. విఘ్నాలను తొలగించే ఆ ఏకదంతుడి ఆలయ నిర్మాణానికి మాత్రం విఘ్నాలు తప్పడంలేదు.

# ముంపులోనే చిన్నోనిపల్లి

- ఇక్కట్లు పడుతున్న స్థానికులు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆక్రోశం
- తాసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు, నిర్వాసితులు
- ఎందుకొచ్చారంటూ నిలదీత



చిన్నోనిపల్లి వీధుల్లో రిజర్వాయర్ తిరుగుజలాలు

గట్టు, సెప్టెంబర్ 6 : చిన్నోనిపల్లికి వరద ప్రవాహం తగ్గడంలేదు. సమాంతర కాల్వ ఏర్పాటు చేసినప్పటికీ గ్రామంలో రిజర్వాయర్ నీరు తగ్గడంలేదు. అవుట్‌ఫ్లో కన్నా ఇన్‌ఫ్లోనే ఎక్కువగా ఉండడంతో ఏరోజుకారోజు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్నది. కాగా కిందిగేరి వీధుల వరకు వచ్చిన వరద శుక్రవారం ఇండ్లు, వాకిళ్ల లోపల వరకు వచ్చాయి. ఇదిలా ఉండగా పరిస్థితిని చూడడానికి తాసీల్దార్ శుక్రవారం చిన్నోనిపల్లికి వచ్చారు. కాగా ఆమె కారుకు అడ్డుగా వచ్చిన గ్రామస్తులు, నిర్వాసితులు, మహిళలు వాహనం ముందుకు వెళ్లకుండా అడ్డుగా నిలిచారు. అంతా అయిపోయాక రావడమేమిటని ప్రశ్నించారు. సౌకర్యాలు దేవుడెరుగు. అందరికీ ప్లాట్లు కూడా ఇవ్వలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తామెక్కడి వెళ్లాలంటూ మహిళలు ఆక్రోశం వెళ్లగక్కారు. అందరూ ప్రజాప్రతినిధులతోపాటు కింది నుంచి పైస్థాయి వరకు అధికారులు కూడా తమను ఆదుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో చేసేదిలేక తాసీల్దార్ సరితారాణి వాహనం నుంచి కిందకు దిగకుండానే వెనుతిరిగారు.



తాసీల్దార్ వాహనాన్ని వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న గ్రామస్తులు, నిర్వాసితులు

# అధ్యాపకులను నియమించాలి

- జేపీనగర్ గురుకుల కళాశాల విద్యార్థుల ధర్నా
- సీవోఈ సెంటర్‌ను తొలగించవద్దని డిమాండ్



కల్వకుర్తి సమీపంలోని జేపీనగర్ గురుకుల కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

కల్వకుర్తి, సెప్టెంబర్ 6 : అధ్యాపకులు లేక విద్యాభ్యాసానికి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీ జయప్రకాశ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఇంటర్ విద్యార్థులు ధర్నా చేపట్టారు. కళాశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇంటర్‌లో 12మంది గెస్ట్ లెక్చరర్లలో 9మందిని తొలగించడంతో ప్రసుత్తం ముగ్గురు మాత్రమే మిగిలారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యాపకులు లేకపోవడంతో ఇంగ్లిష్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బాటనీ సబ్జెక్ట్‌ల్లో వెనుబడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకులు లేక తరగతి గదుల్లో ఖాళీగా కూర్చుంటున్నామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కళాశాలకు సీవోఈ(కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) సెంటర్ ఉందని, సీవోఈని తొలగిస్తారనే ప్రచారం వినిపిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో సీవోఈ తొలగించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జోనల్ అధికారులు వచ్చే వరకు కళాశాల ఎదుట కూర్చుని నిరసన వ్యక్తం చేస్తూనే ఉంటామని విద్యార్థులు భీష్మించుకొని కూర్చున్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు జోనల్ అధికారికి ఫోన్ చేసి విద్యార్థులతో మాట్లాడించారు. సోమవారం నాటికి అధ్యాపకులను పంపిస్తామని జోనల్ అధికారి హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. అనంతరం ధర్నా విరమించి తరగతులకు హాజరయ్యారు.

# కృష్ణా, తుంగభద్రకు వరద

- అన్ని ప్రాజెక్టులకు పెరిగిన ఇన్‌ఫ్లో
- జూరాల 16 గేట్ల నుంచి విడుదల

గద్వాల/అలంపూర్/శ్రీశైలం, సెప్టెంబర్ 6 : పది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో అన్ని ప్రాజక్టులకు వరద నమోదవుతున్నది. శుక్రవారం జూరాల డ్యాంకు ఇన్‌ఫ్లో 1,36,000 క్యూసెక్కులు ఉండగా.. 16 గేట్లు తెరచి దిగువకు 1,44,322 క్యూసెక్కులు వదులుతున్నారు. పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.869 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. విద్యుదుత్పత్తికి 30,954 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 32,347 క్యూసెక్కులు వస్తుండగా.. 12 గేట్ల ద్వారా వరద విడుదల చేస్తుండగా.. అవుట్‌ఫ్లో 32,047 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 101.773 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 30,337 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 29,700 క్యూసెక్కులు ఉండగా.. ఆనకట్టలో 10.2 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 64,322 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 72,436 క్యూసెక్కులు నమోదైంది. ఫుల్ లెవల్ 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 126.92 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 76,332 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 77,837 క్యూసెక్కులు నమోదుకాగా.. సామర్థ్యం 37.64 టీఎంసీలకుగానూ 37.25 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. శ్రీశైలం జలాశయానికి 1.49 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఆరు గేట్ల ద్వారా 1,67,076 క్యూసెక్కులు వదులుతున్నారు.

**కోయిల్‌సాగర్ @ 5 గేట్లు**


దేవరకద్ర/కొత్తకోట, సెప్టెంబర్ 6 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండటంతో శుక్రవారం 5 గేట్లను తెర్చి 35వేల క్యూసెకుల నీటిని ఊకచెట్టువాగుకు వదులుతున్నారు. కొత్తకోట మండలంలోని కానాయపల్లి గ్రామ సమీపంలోని శంకరసముద్రం రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతున్నది. దీంతో శుక్రవారం 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నట్లు ఏఈ అఖిల్ తెలిపారు. ఎగువ నుంచి 3,500 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా 4,500 క్యూసెక్కుల నీటిని 5 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.



ఊట్కూర్ మండలం పగిడిమర్రి వాగు పొంగిపొరుతుండడంతో దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సీసీ కుంట మండలం ఉంద్యాల గ్రామంలో ఇండ్లను చుట్టుముట్టిన వరద



ఊట్కూరు : ఓబ్లాపూర్ వద్ద పత్తి పంటను ముంచెత్తిన వరద

# వదలని వర్షం

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల భారీగా వాన
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- అలుగు పారిన చెరువులు, కుంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఇండ్లల్లోకి చేరిన నీరు.. స్థానికుల ఇక్కట్లు

కేటీదొడ్డి/గట్టు/మల్దకల్/ఇటిక్యాల/హన్వాడ/ఊట్కూరు/దేవరకద్ర రూరల్, సెప్టెంబర్ 6 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను వర్షం వదలడం లేదు. గురువారం రాత్రి పలు చోట్ల భారీ వర్షం కురిసింది. కేటీదొడ్డి మండలంలో 56.4 మి.మీ., గట్టులో 48.4 మి.మీ., మల్దకల్‌లో 53.2 మి.మీ., మద్దూ రులో 92.2 మి.మీ., నారాయణపేటలో 70.0 మి.మీ., మాగనూరులో 88.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు మరోసారి పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు మత్తడి దుంకాయి. కల్వర్టుల వద్ద వరద పెద్ద ఎత్తు న పారడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటిక్యాల మండల కేంద్రంలోని ఊర చెరువు అలుగు పారడంతో ఎస్సీ కాలనీ ప్రజలకు గ్రామంతో సంబంధాలు తెగిపోయాయి. పలు గ్రామాల సమీపంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌లలో లోతుగా నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మల్దకల్ మండలంలో దాదాపు 100 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. మహబూబ్‌నగర్–తాండూరు రోడ్డుపై ఇబ్రహీంబాద్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. అలుగు నుంచి బైక్‌పై ఓ వ్యక్తి వెళ్తుడంగా ఉధృతికి కిందపడగా.. అక్కడున్న యువకులు వెంటనే బైకును బయటకు తీశారు. చిన్నచింత కుంట మండలం ఉంద్యాల గ్రామం హరిజన వాడలోని పలు ఇండ్లల్లోకి సమీపంలోని చెరువు నీళ్లు చేరాయి. ఊట్కూర్ మండలం పగిడిమర్రి, కొత్తపల్లి, బిజ్వారం గ్రామాల మధ్య ప్రయాణం సాగలేదు. పలు గ్రామాల్లో పాత ఇండ్లు నేలమట్టమయ్యాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి వరుణుడు కరుణతో ఎడతెరిపి లేకుండా వానలు పడడంతో పంటలకు నష్టం ఏర్పడింది.



మాగనూరు : అడవి సత్యారం గ్రామ శివారులో విద్యార్థులను ట్రాక్టర్‌లో వాగు దాటిస్తున్న దృశ్యం



హన్వాడ : ఇబ్రహీంబాద్ వద్ద వృద్ధుడిని అలుగు దాటిస్తున్న యువకులు

